క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



పెనమలూరు: గోసాల గ్రామం వైకుంఠపురంలో శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయ నిర్మాణం చేయటానికి గురువారం గ్రామ సర్పంచి సంగెపు శ్రీనివాసరావు శంకుస్థాపన చేశారు. గ్రామంలో ఉదయం ఏడు గంటలకు ఆలయ నిర్మాణం చేయటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారి ఆలయ నిర్మాణం చేయనున్నారు. కార్యక్రమంలో గ్రామ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు పోలవరపు రవి, కన్వీనర్ షేక్ మస్తాన్‌వలి, పంచాయతీ వార్డు సభ్యులు భువనగిరి వెంకటరమణ, షేక్ పీర్‌అహ్మద్, గుమ్మి శ్రీనివాసరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థుల రక్తదానం



పెనమలూరు: కానూరులో ఇంజినీరింగ్ విద్యార్థులు గురువారం రక్తదానం చేశారు. కానూరు పీవీపీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీకి చెందిన ఎన్ఎస్ఎస్ యూనిట్, లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. దాదాపు 107 మంది ఇంజినీరింగ్ విద్యార్థులు రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదానం చేశారు. రక్తదానం చేసిన విద్యార్థులకు కాలేజీ కన్వీనర్ తాతినేని శ్రీహరిరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ కొంపల్లి శివాజీబాబు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కేఆఈర్‌కే ప్రసాద్, వినోద్ ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ డాక్టర్ శ్యామ్ పాల్గొన్నారు.

13 నుంచి హనుమజ్జయంతి వేడుకలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం దాసాంజనేయస్వామివారి దేవాలయంలో ఈ నెల 13వ తేదీ నుంచి 17 వరకు హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి నాగినేని భవాని, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కనపర్తి కొండలరావు తెలిపారు. మాచవరం దాసాంజనేయస్వామి వారి దేవాలయంలో గురువారం హనుమజ్జయంతి వేడుకల కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 13వ తేదీ శనివారం సాయంత్రం ఆరు గంటలకు విఘ్నేశ్వర పూజతో హనుమజ్జయంతి వేడుకలు ప్రారంభమవుతాయని చెప్పారు. స్వామివారికి విశేషంగా మన్యుసూక్త పారాయణ పారాయణం జరుగుతాయన్నారు. 14వ తేదీ ఆదివారం హనుమజ్జయంతి సందర్భంగా తెల్లవారుజామున ఐదు గంటల నుంచి నాగవల్లిదళ అర్చనలు, ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు. 15వ తేదీ సోమవారం నాగవల్లీ దళ సహస్రనామార్చన, ఉదయం పది గంటలకు లక్ష తమలపాకుల పూజ జరుగుతాయన్నారు. 16వ తేదీ మంగళవారం స్వామివారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు ఆలయ అర్చకులు నిర్వహిస్తారన్నారు. 17వ తేదీ బుధవారం 11 గంటల నుంచి అన్నప్రసాద వితరణ, సాయంత్రం మేళతాళాలు, సన్నాయి మేళంతో ఒంటె వాహనంపై స్వామివారి గ్రామోత్సవం జరుగుతాయన్నారు. హనుమజ్జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రణాళికాబోర్డు వైస్ చైర్మన్ మల్లాది విష్ణు, దేవదాయ ధర్మదాయ శాఖ ప్రాంతీయ సంయుక్త కమీషనర్ ఎం.సురేష్ బాబు ముఖ్య అతిథులుగా పాల్గొంటారని తెలిపారు. భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాల్సిందిగా కోరారు. ప్రత్యేక ఆహ్వానితులు పోలుకొండ శ్రీనివాసరావు, ఆలయ ధర్మకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అండగా ప్రభుత్వం



తడిసిన పసుపు కొమ్ములను పరిశీలిస్తున్న ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ మద్దాలి రామచంద్రరావు తదితరులు



వణుకూరులో వర్షానికి తడిసిన పసుపు పంటను పరిశీలిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు, అధికారులు

కంకిపాడు: రైతులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని, అండగా నిలుస్తుందని ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ మద్దాలి రామచంద్రరావు అన్నారు. అకాల వర్షాలకు పంటలు దెబ్బతిన్న దావులూరు, చలివేంద్రపాలెం గ్రామాల్లో గురువారం ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నేతలు పర్యటించారు. ఆయా గ్రామాల్లో పంట పొలాల్లో ఆరబోసిన మొక్కజొన్న, పసుపు కొమ్ములను పరిశీలించారు. మొక్కజొన్న మొలకలు వచ్చి, పసుపు దుంపలు నలుపు రంగులోకి మారిందని రైతులు వివరించారు. ఎంపీపీ రాజ్యలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ రామచంద్రరావు మాట్లాడుతూ గ్రామాల వారీగా పంట నష్టాలను అధికారులు అంచనా వేస్తున్నారన్నారు. పంట నష్టపోయిన ప్రతి రైతునూ ఆదుకునేలా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. పర్యటనలో అగ్రిబోర్డు చైర్మన్ చాట్ల విజయ్‌బాబు, చలివేంద్రపాలెం సర్పంచ్ బొమ్మారెడ్డి శివనాగిరెడ్డి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ దేవిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, ఉద్యానశాఖ అధికారి జోసఫ్ చందు, రైతులు పాల్గొన్నారు.

రైతులకు అన్యాయం జరగనివ్వం..

పెనమలూరు: అకాల వర్షాల కారణంగా పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని వైఎస్సార్ సీపీ నేతలు రైతులకు హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి ఆదేశాలతో పెనమలూరు మండలంలో వణుకూరు, గోసాల ప్రాంతాల్లో వైఎస్సార్ సీపీ నేతలు గురువారం పర్యటించి క్షేత్రస్థాయిలో నష్టపోయిన పంటలను పరిశీలించి రైతులు, అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కానూరు మాజీ సర్పంచి అన్నే వేణుగోపాలకృష్ణమూర్తి మాట్లాడుతూ అకాల వర్షాల కారణంగా రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. మండల పరిధిలో పసుపు, జొన్న, మొక్కజొన్న, అరటి, వరి పంటలు నీట తడిచాయన్నారు. రైతులకు జరిగిన నష్టంపై ఇప్పటికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి స్పందించారని తెలిపారు. నష్టపోయిన పంటల వివరాలు నమోదు చేయాలని ఆదేశించారని అన్నారు. అధికారులు కూడా ఎన్యూమరేషన్ ప్రారంభించారని, రైతులు వారి వివరాలు అధికారులకు చెప్పాలని సూచించారు. పంట నష్టం వివరాలు అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపుతారన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ మద్దాలి రామచంద్రరావు, కంకిపాడు ఎంపీపీ నెర్సు రాజ్యలక్ష్మి, గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ ఈడే చాముండేశ్వరి, సర్పంచిలు కాకర్ల వెంకటరత్నం, లింగాల భాస్కరరావు, పెనమలూరు సొసైటీ అధ్యక్షుడు వేమూరి రాజా, ఏవో కనకమేడల శైలజ, వైఎస్సార్ సీపీనేతలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య చర్యలు

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలంలో మూడు రోజులుగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పలు గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య చర్యలు చేపట్టారు. రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు గ్రామాల్లో ఆయా పంచాయతీల కార్యదర్శుల పర్యవేక్షణలో పారిశుధ్య కార్మికులు డ్రెయిన్లలో పూడికతీత, లోతట్టు ప్రాంతాల్లో నిలిచిన వర్షపు నీటిని తోడించడం, వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించి డంపింగ్ యార్డ్‌లకు తరలించడం వంటి పనులు ముమ్మరంగా చేస్తున్నారు. ఈ సందర్భంగా రామవరప్పాడు పంచాయతీ కార్యదర్శి ఘంటా రామ్మోహనరావు మాట్లాడుతూ.. అంతర్గత రహదారుల్లో నిలిచిన నీటిని తరలించడానికి సిండికేట్ బ్యాంక్ కాలనీ, బల్లెంవారి వీధిలో మినీ జేసీబీతో సైడు డ్రెయిన్లలో పూడికతీయించామన్నారు. పారిశుధ్య పనుల నిర్వహణలో ఏమైనా సమస్యలు తలెత్తితే పంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని సూచించారు.



రామవరప్పాడులో పూడికతీతను పర్యవేక్షిస్తున్న కార్యదర్శి రామ్మోహనరావు

నేడు రామలింగేశ్వరస్వామి ఆలయ ప్రతిష్ట



విగ్రహప్రతిష్ట పూజల్లో పాల్గొన్న మహిళలు



ప్రతిష్టా ఉత్సవానికి ముస్తాబైన శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయం

గన్నవరం రూరల్: మండలంలోని సూరంపల్లి శివారు రామచంద్రాపురంలో శుక్రవారం శ్రీ పరివార దేవత సహిత శ్రీ పార్వతి సమేత శ్రీ రామలింగేశ్వర స్వామివార్ల విగ్రహ ప్రతిష్ఠాపన, కుంభాభిషేకం మహోత్సవం వైభవంగా జరగనున్నాయి. బుధవారం నుంచి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యాగశాలలో వేదపండితులు ఇడమకంటి జనార్దన శివాచార్యస్వామి పర్యవేక్షణలో ప్రత్యేక హోమాలు, పూజలు జరుగుతున్నాయి. గురువారం గణాధిపతి పూజ, పుణ్యాహవాచన, గ్రామంలో కన్యా ముత్తయిదువలతో సామూహిక కుంకుమార్చన, మహానైవేద్య మంత్రపుష్ప మంగళ హారతి కార్యక్రమాలు జరిగాయి. శుక్రవారం ప్రత్యేక పూజలతో పాటు స్వామివారి, అమ్మవారి విగ్రహాల ప్రతిష్ట, శాంతి కల్యాణం జరుగుతాయని గ్రామ పెద్దలు తెలిపారు.

వైభవంగా వేణుగోపాలుని కల్యాణం



వేణుగోపాలస్వామి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

పెనమలూరు: మండల పరిధిలో యనమలకుదురు, పోరంకి గ్రామాల్లో వేంచేసి ఉన్న శ్రీ రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామివారి కల్యాణ మహోత్సవం గురువారం అత్యంత వైభవంగా జరిగింది. యనమలకుదురులోని శ్రీ వేణుగోపాల స్వామివారి ఆలయంలో లోక కల్యాణార్థం త్రయాహ్నిక దీక్ష కల్యాణ మహోత్సవం భక్తుల సమక్షంలో చేశారు. ఇందులో భాగంగా గురువారం ఉదయం స్వామివారికి అగ్నిప్రతిష్ట, నిత్యహోమం, మూల మంత్రహోమం చేశారు. రాత్రి 7.00 గంటలకు వెలగపూడి శ్రీనివాసరావు దంపతులు స్వామివారికి తిరుకల్యాణం వైభవంగా జరిపించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి కల్యాణం తిలకించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. గ్రామంలో శుక్రవారం రాత్రి గ్రామోత్సవం చేస్తారు.

పోరంకిలో..

పోరంకి శ్రీవసంతవేణుగోపాలస్వామి, శ్రీఆంజనేయ స్వామివార్ల దేవస్థానంలో శ్రీరుక్మిణి, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామివారి కల్యాణ మహోత్సవాలు ఘనంగా చేశారు. ఆలయంలో గురువారం రాత్రి 7.30 గంటలకు దివ్య కల్యాణ మహోత్సవం బి.చతుర్వేది, బొర్రా భవానీశివశంకర్ రావు దంపతులు స్వామివారి కల్యాణం భక్తులు సమక్షంలో చేశారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

కానూరులో వ్యక్తి అదృశ్యం

పెనమలూరు: కానూరు సనత్‌నగర్‌లో వ్యక్తి అదృశ్యం అవ్వటంతో పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కానూరు సనత్‌నగర్‌లో షేక్ ఆవూద్‌బాషా కుటుంబ సభ్యులతో నివసిస్తున్నాడు. అతను ఆటోనగర్‌లో డిస్పోజల్ షాపు ఉంది. కాగా దావూద్‌బాషా ఈ నెల 2వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. అతని కోసం కుటుంబ సభ్యులు వెతికినా అతని ఆచూకీ తెలియలేదు. అతని కుమారుడు షరీఫ్ పోలీసులకు ఫిర్యాదు చేస్తూ తన తండ్రి కుటుంబ తగాదాల కారణంగా ఇంటి నుంచి వెళ్లాడని పేర్కొన్నాడు.

7 నుంచి ఆరాధన పండుగలు

ఉయ్యూరు: జియోన్ మినిస్ట్రిస్ ఆధ్వర్యంలో ఆదివారం ఆరాధన పండుగలు ఈనెల 7వ తేదీ నుంచి ఉయ్యూరు మెయిన్‌రోడ్డులోని సీబీఎం స్కూల్ గ్రౌండ్‌లో జరుగుతాయని పాస్టర్ జి. విలియం బూత్, తబిత గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 7, 14, 21, 28 తేదీలలో సాయంత్రం 6.30 నుంచి రాత్రి 9 గంటల వరకు ఆరాధన జరుగుతుందని చెప్పారు.

7న ఘన చరితుడు ఘంటసాల నాటక ప్రదర్శన

విజయవాడ కల్చరల్:పోలవరపు కోటేశ్వరరావు సాహితీపీఠం, మధురం సేవా సమితి ఆధ్వర్యంలో 7 వ తేదీ సాయంత్రం సురభి కళాకారులచే ఘనచరితుడు ఘంటసాల నాటక ప్రదర్శన నిర్వహిస్తునట్లు నాటక రచయిత భాస్కరుని జగదీష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అంతర్జాతీయ ఖ్యాతి గడించిన సురభి కళాకారులచే నాటక ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

టైలరింగ్ శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర పాలక సంస్థ 3 సర్కిల్స్ పరిధిలోని స్లమ్ ఏరియాల్లో మహిళలకు స్వయం ఉపాధి కల్పించేందుకు 22 కుట్టు శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేశామని వీఎంసీ పట్టణ సాధికారాభివృద్ధి విభాగం (ప్రాజెక్ట్) అధికారి కె. శకుంతల గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా కేంద్రాల్లో కుట్టు శిక్షణ ఇచ్చేందుకు టైలరింగ్ టీచర్స్ అనుభవం, ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని యూసీడీ సెక్షన్‌లో సంప్రదించాలని కోరారు.

రైతులకు మెరుగైన సేవలు అందించాలి



నియామకపత్రాలు అందుకుంటున్న సుంకర రాజేంద్రప్రసాద్

ఉంగుటూరు: సహకార సంఘ ప్రగతికి, రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని తహసీల్దార్ డి.వనజాక్షి సూచించారు. పొణుకుమాడు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నూతన పాలకవర్గం ప్రమాణస్వీకారం గురువారం జరిగింది. చైర్మన్‌గా సుంకర రాజేంద్రప్రసాద్, సభ్యులుగా తమలం శామ్యూల్ రామిశెట్టి శివశంకర్‌రావు బాధ్యతలు స్వీకరించారు. ముఖ్య అతిథిగా హాజరైన తహసీల్దార్ వనజాక్షి మాట్లాడుతూ.. సహకార సంఘాలు రైతుల సంక్షేమానికి కృషి చేయాలన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులూ ఎదురవకుండా వారికి ఉత్తమ సేవలు అందించడం ద్వారా సంఘం ఎదుగుదలకు పాటుపడాలని కోరారు. నూతన చైర్మన్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. పొణుకుమాడు పీఏసీఎస్ వ్యవస్థాపకుడు, జెడ్పీ మాజీ చైర్మన్ సుంకర సత్యనారాయణ ఈ సంఘాన్ని ప్రగతి పథంలో నడిపించారని గుర్తు చేశారు. ఆయన బాటలో పయనిస్తూ సంఘం ఉన్నతికి కృషి చేస్తానన్నారు. తాను 1987–90 సంవత్సరాల్లో ఇదే సొసైటీ అధ్యక్షుడిగా సేవలు అందించానని గుర్తుచేసుకున్నారు. ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ సహకారంతో పొణుకుమాడు సొసైటీ చైర్మన్‌గా మరోసారి బాధ్యతలు చేపట్టానని పేర్కొన్నారు. సొసైటీ కార్యదర్శి బి.రాఘవయ్య, తేలప్రోలు, సిరివాడ సంఘ అధ్యక్షులు తియ్యగూర రామిరెడ్డి, సింగవరపు రామశివనాగేశ్వరరావు, గ్రామ పెద్దలు పాతూరి బాబూజి తదితరులు పాల్గొన్నారు.

వివాహితతో అసభ్య ప్రవర్తన.. వ్యక్తిపై కేసు

పెనమలూరు: వివాహిత పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ ఎం.కిశోర్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం కంకిపాడు మండలం వేల్పూరు గ్రామానికి చెందిన చెన్నబోయిన రాజేశ్వరికి భర్త ఇద్దరు పిల్లలు ఉన్నారు. భర్త అరుణ్‌కుమార్ వ్యాన్ డ్రైవర్‌గా పని చేస్తాడు. అయితే రాజేశ్వరి అన్న స్నేహితుడు గగన్‌కుమార్ రాజేశ్వరి ఫోన్ నంబర్ తెలుసుకుని గత కొద్ది రోజులుగా ఆమెను వేధించసాగాడు. ఈ క్రమంలో రాజేశ్వరి ఉప్పులూరులో ఆస్పత్రికి వెళ్లి ఇంటికి వస్తున్న సమయంలో గగన్‌కుమార్ ఆమె వద్ద బలవంతంగా ఫోన్ తీసుకుని, బెదిరించి దాడి చేసి వచ్చాడు. దీంతో రాజేశ్వరి తన ఫోన్ కోసం పెనమలూరు గగన్‌కుమార్ వద్దకు వచ్చి ఫోన్ అడుగగా ఆమెను చంపుతానని గగన్‌కుమార్ బెదిరించాడు. దీంతో బాధితురాలు పెనమలూరు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు గగన్‌కుమార్‌పై కేసు నమోదు చేశారు.

గోడౌన్ల నిర్మాణానికి స్థలాలను గుర్తించండి

కలెక్టర్ రాజాబాబు



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు, చిత్రంలో జేసీ, డీఆర్వో

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో మల్టీపర్పస్ ఫెసిలిటీ సెంటర్ల నిర్మాణానికి అనువైన స్థలాలను గుర్తించాలని కలెక్టర్ పి. రాజాబాబు అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి గురువారం సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో రీ-సర్వే, జాతీయ రహదారుల భూ సేకరణ, స్పందన, జగనన్న ఇళ్ల నిర్మాణాలు, జగనన్న పాలవెల్లువ, ఉపాధి హామీ పథకం, ఆధార్ నమోదు తదితర అంశాలపై సమీక్షించారు. జిల్లాలో జరుగుతున్న ఆయా అంశాలకు సంబంధించిన పురోగతి వివరాలను సీఎస్‌కు కలెక్టర్ వివరించారు. అనంతరం అధికారులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశాల మేరకు మల్టీపర్పస్ ఫెసిలిటీ సెంటర్ల నిర్మాణాన్ని పూర్తి చేసి అందుబాటులోకి తీసుకు రావాల్సి ఉందన్నారు. అందుకు అవసరమైన స్థలాలను గుర్తించి నిర్మాణాలను చేపట్టాలని చెప్పారు. నిర్ణీత సమయంలోనే స్పందన అర్జీలకు పరిష్కారం చూపాలన్నారు. జగనన్న ఇళ్ల నిర్మాణాల పురోగతిలో ముందంజలో ఉన్నామని, అధికారులు మరింత శ్రద్ధ చూపి వివిధ దశల్లో ఉన్న నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసేలా లబ్ధిదారులను ప్రోత్సహించాలని చెప్పారు. అన్ని లేఅవుట్లలో తాగునీటి వసతి, విద్యుత్ సౌకర్యం కల్పించడంతో పాటు మెటీరియల్ కొరత లేకుండా చూడాలన్నారు. అవసరమైన వారికి రుణాలు మంజూరు చేయించాలని చెప్పారు. ఉపాధి హామీ కూలీలకు గతంలో చెల్లించాల్సిన నగదు విషయంలో బ్యాంక్ అకౌంట్ నెంబర్లలో తప్పులు రావడం, ఆధార్ నమోదు కాకపోవడం వంటి సాంకేతిక సమస్యలను గుర్తించామని, వాటిని సరిచేసి నగదు జమ అయ్యేలా చూడాలన్నారు. గ్రామ సచివాలయాలు, ఆర్బీకేలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్, బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్లు తదితర భవన నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ చెప్పారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ అపరాజిత సింగ్, డీఆర్వో ఎం. వెంకటేశ్వర్లు, అధికారులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ కల్యాణమస్తు సంబరాలు

ఉంగుటూరు: మండలంలోని నాగవరప్పాడు ఎంపీపీ పాఠశాలలో వైఎస్సార్ కల్యాణ మస్తు, షాదీతోఫా సంబరాలను శుక్రవారం నిర్వహిస్తామని ఎంపీడీఓ శేషగిరిరావు తెలిపారు. ఆయన గురువారం స్థానిక విలేకరులతో మా ట్లాడారు. మండల వ్యాప్తంగా వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీతోఫా పథకాల ద్వారా 16 మందికి రూ.11.20 లక్షల లబ్ధి చేకూరనుందని తెలిపారు. ఈ నేపథ్యంలో వధువు తల్లి బ్యాంకు ఖాతాలో నగదు శుక్రవారం జమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు హాజరు కావాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గన్నవరం రూరల్: మండలంలోని సూరంపల్లి, చనుపల్లివారిగూడెం, మాదలవారిగూడెం గ్రామాల్లో శుక్రవారం ఉదయం ఏడు నుంచి తొమ్మిది గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు గుణదల విద్యుత్ శాఖ ఆపరేషన్ ఈఈ పి.హరిబాబు తెలిపారు. లైన్ల మరమ్మతుల నిమిత్తం సరఫరా నిలిపివేస్తున్నామని పేర్కొన్నారు. గృహ, పరిశ్రమల, వ్యవసాయ విద్యుత్ వినియోగదారులు అందరూ సహకరించాలని కోరారు.

పెనమలూరులో మహిళపై దాడి

పెనమలూరు: పెనమలూరులో మహిళపై పలువురు వ్యక్తులు దాడి చేయటంతో పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ కిశోర్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం పెనమలూరు పెద్దగుడి ప్రాంతానికి చెందిన గజ్జల కొండ దేవి గత కొంతకాలం క్రితం శీలం నవీన్‌కు రూ. 75 వేలు అప్పుగా ఇచ్చింది. అతను ఎంతకూ తీసుకున్న అప్పు తిరిగి చెల్లించక పోవటంతో దేవి అతని ఇంటి వద్దకు వెళ్లి సొమ్ము విషయమై అడిగింది. దీంతో ఆగ్రహించిన నవీన్, అతని కుటుంబ సభ్యులు మరియమ్మ, యలమందయ్య, ప్రదీప్‌లు దేవిని బెదిరించి ఆమెపై దాడి చేశారు. ఈ ఘటనపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.